# సాక్షి చిత్తూరు

శుక్రవారం । 13 । డిసెంబర్ । 2024




## ఎడతెరపి లేని వాన

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు పాదిరేడు పెద్దచెరువు కట్ట కుంగడంతో అధికారులు మరమ్మతులు చేపట్టారు. - 8లో



## ఒంటరి ఏనుగు బీభత్సం

ఐరాల మండలం వినాయకపురంలో ఒంటరి ఏనుగు పంటలపై దాడులు చేసి నష్టం కలిగించింది. - 8లో



## ఆఖరి అస్త్రంగా వాడాలి

పంటలసాగులో రసాయన ఎరువులను ఆఖరి అస్త్రంగా వాడాలని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం కోఆర్డినేటర్ తెలిపారు. - 8లో

## న్యూస్‌రీల్

### నేటి రైతు ర్యాలీని జయపద్రం చేయండి



విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: రైతుల సమస్యలపై వైఎస్సార్‌సీపీ తలపెట్టిన ర్యాలీని జయపద్రం చేయాలని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ర్యాలీ ప్రారంభం అవుతుందన్నారు. స్థానిక గిరింపేటలోని దుర్గమ్మ ఆలయం నుంచి ర్యాలీగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు చెందిన ఇన్‌చార్జ్‌లు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు, రైతులతో కలిసి పాల్గొంటారన్నారు. అక్కడ నుంచి కలెక్టరేట్ వరకు రైతుల డిమాండ్లను ప్లకార్డులతో ప్రదర్శనగా చేరుకుంటామని తెలిపారు. అనంతరం రైతుల సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని వివరించారు.

### జాతీయ లోక్ అదాలత్ రేపు

చిత్తూరు అర్బన్: చిత్తూరు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈనెల 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను ఇరు పక్షాల కక్షిదారులు రాజీచేసుకోవడం ద్వారా.. అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షిదారుల కోసం జిల్లాలోని 35 ప్రాంతాల్లో అదాలత్ నిర్వహణ బెంచ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### సుబ్రమణ్యంకు గద్దర్ జాతీయ సేవా అవార్డు



డాక్టర్ వెన్నెల గద్దర్ నుంచి అవార్డు అందుకుంటున్న సుబ్రమణ్యంబాబు

రొంపిచెర్ల: గద్దర్ జాతీయ సేవా అవార్డును గ్రేట్ విజన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ జీవీ సుబ్రమణ్యంబాబు అందుకున్నారు. మండలంలోని జాండ్లవారిపల్లె పంచాయతీ కన్నంకాడ దళితవాడకు చెందిన సుబ్రమణ్యంబాబు గత 21 ఏళ్లుగా సమాజసేవ చేస్తున్నారు. అందుకు గుర్తింపుగా ఆయన అవార్డుకు ఎంపికయ్యారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరంలోని సాయితేజ జూనియర్ కళాశాలలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో గద్దర్ కుమార్తె డాక్టర్ వెన్నెల గద్దర్ చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యంబాబు మాట్లాడుతూ ఈ అవార్డు మరింత ఉత్సాహంగా పని చేయడానికి ప్రేరణ అవుతుందన్నారు. కార్యక్రమంలో పి.గన్నవరం ఎమ్మెల్యే సత్య నారాయణ, మమతా స్వచ్ఛందా సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కోరుకొండ జాన్ పాల్గొన్నారు.

ఎన్నికలప్పుడు చంద్రబాబు ఇచ్చే హామీలు అన్నీ ఇన్నీ కావు. అధికారంలో ఉండే పాలకులు ఇచ్చే సంక్షేమాలను కాదని.. తాను అంతకంటే ఇంకా ఎక్కువ ఇస్తా అని నమ్మిస్తారు. తీరా అధికారంలోకి వచ్చాక.. గతంలో మాదిరే ఈసారి కూడా ప్రజలను నట్టేట ముంచుతున్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ, బీజేపీ, జనసేన నేతలంతా జతకట్టి సూపర్‌సిక్స్ అంటూ ఊదరగొట్టారు. ఆర్నెళ్లుగా ఆ హామీలను అమలు చేయకుండా.. ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి బెదిరిస్తున్నారు. ఫెంగల్ తుపాన్ ధాటికి పంటలు నష్టపోయిన రైతులకు సాయం అందించకుండా కూటమి సర్కారు చేతులెత్తేసింది. ఈ నేపథ్యంలోనే 'అన్నదాతలకు అండగా వైఎస్సార్‌సీపీ' నిర్వహించేందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టనున్నారు.




# ఇదేం చంద్రం.. హామీలు మాయం

## ప్రజలకు వెన్నుదన్నుగా వైఎస్సార్‌సీపీ

- నేడు చిత్తూరులో జిల్లా రైతులకు అండగా నిరసన ర్యాలీ
- ఎన్నికలప్పుడు సూపర్‌సిక్స్ అంటూ ఊదరగొట్టిన కూటమి నేతలు
- అధికారంలోకి వచ్చాక హామీలను చూస్తే భయమేస్తోందంటూ అసెంబ్లీలోనే చేతులెత్తేసిన సీఎం చంద్రబాబు
- హామీలు అమలు చేయకుండానే ఊరూరా మంచి ప్రభుత్వం అంటూ ప్రచారాలు
- ఇక సీఎం సొంత జిల్లాకు ఇచ్చిన హామీలూ అటకెక్కినట్లే..!
- ఆర్నెళ్ల పాలనలో హామీల గురించి ప్రశ్నించిన వారిపై కేసులు
- కూటమి సర్కారుపై మూడు దశల్లో వైఎస్సార్‌సీపీ పోరుకు సిద్ధం


చిత్తూరు కలెక్టరేట్ : విపత్తుల వేళ అండగా అన్నదాతలకు అండగా ఉండాల్సిన కూటమి ప్రభుత్వం మిన్నకుండిపోయింది. ఎన్నికలప్పుడేమో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పి.. అధికారంలోకి వచ్చి ఆర్నెళ్లు గడుస్తున్నా ఇంతవరకు అతీగతీ లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాదిరి పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నా.. పాలకుల నుంచి స్పందన లేదు. ఆర్నెళ్ల పాలనపై విసిగి వేసారిన ప్రజల తరఫున, ఆరుగాలం కష్టపడి నష్టపోతున్న అన్నదాతలకు అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆ మేరకు మూడు దశల్లో ఆందోళనకు జిల్లా నాయకులు సిద్ధమయ్యారు. శుక్రవారం చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 9.30 గంటలకు నగరంలోని దుర్గమ్మగుడి సమీపం నుంచి అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు, రైతులతో కలిసి కలెక్టరేట్‌కు ప్రదర్శనగా వెళ్లనున్నారు. అనంతరం రైతుల సమస్యలపై నిరసన చేపట్టి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నారు.

**ఎన్నికలప్పుడు అలా.. ఇప్పుడు ఇలా..**

అధికారం చేపట్టిన తొలి ఆరు నెలల్లోనే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న ఘనత ఈకూటమి సర్కారుదే. జిల్లాలోని 32 మండలాల్లో గత ఆరు నెలలుగా సంక్షేమ పథకాలను అమలు చేయకపోవడంతో రూ.1,750.95 కోట్ల ప్రభుత్వ లబ్ధిని పేద ప్రజలు కోల్పోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వంపై ప్రజల తరఫున పోరాటాలకు వైఎస్సార్‌సీపీ సిద్ధమైంది.

## నేడు చిత్తూరులో వైఎస్సార్‌సీపీ మహా ర్యాలీ

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రైతులకు అండగా నిలబడేందుకు చిత్తూరులో శుక్రవారం 'రైతన్న పక్షం' పేరుతో భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించనున్నారు. చిత్తూరులోని గిరింపేట దుర్గమ్మ ఆలయం వద్ద ఉదయం 10 గంటలకు పార్టీ శ్రేణులు చేరుకొనున్నాయి. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్, మాజీ ఎంపీ రెడ్డెప్ప, పూతలపట్టు, పలమనేరు మాజీ ఎమ్మెల్యేలు సునీల్, వెంకటేగౌడ, చిత్తూరు, గంగాధర నెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్తలు విజయానందరెడ్డి, కృపాలక్ష్మి, ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులతో కలిసి కలెక్టరేట్ వరకు ర్యాలీ వెళ్లనున్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించనున్నారు.



- 19- 59 సంవత్సరాల వయసు కలిగిన ప్రతి మహిళకు ప్రతి నెలా రూ.1500 అందజేస్తామని చెప్పారు. ఆర్నెళ్లుగా ఇవ్వకపోవడంతో జిల్లాలో అర్హులైన 5,89,958 మంది మహిళలు రూ.530.96 కోట్లు నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడింది.



- అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు రూ.20 వేలు ఇస్తామని చెప్పి.. నేటికీ ఇవ్వలేదు. దీంతో జిల్లాలోని 2,29,950 మంది రైతులు పెట్టుబడి సాయం అందక రూ.459.90 కోట్లను నష్టపోయారు.



- తల్లికి వందనం పథకం సాయం కోసం జిల్లాలోని 2,48,500 మంది తల్లులు ఎదురు చూశారు. విద్యాసంవత్సరం ముగుస్తున్నప్పటికీ ఇంతవరకు ఆ పథకం ఊసే లేదు. దీంతో జిల్లావ్యాప్తంగా రూ.372.75 కోట్లను తల్లులు నష్టపోయారు.



- ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక జిల్లాలో ఉన్నత విద్యనభ్యసిస్తున్న 1,01,370 మంది పేద విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఫీజులు కట్టని విద్యార్థులను కళాశాలల నిర్వాహకులు బయటకు నెట్టేస్తున్నారు. దీంతో జిల్లాలో రూ.134.58 కోట్లను విద్యార్థులు నష్టపోవాల్సి వచ్చింది.

**20 లక్షల ఉపాధి అవకాశాలు లేదా నెలకు రూ. 3000 నిరుద్యోగ భృతి**



- నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఆ భృతి జోలికే వెళ్లలేదు. దీంతో జిల్లాలో ఉన్నత చదువులు చదివిన 1,40,426 మంది నిరుద్యోగులు ఆర్నెళ్లుగా భృతి కోసం ఎదురు చూసి రూ.252.76 కోట్లను నష్టపోయారు.
- సీఎం ప్రమాణ స్వీకారంలో తొలిసంతకం చేసిన మెగా డీఎస్సీ హామీ కూడా అమలుకు నోచుకోలేదు. జిల్లావ్యాప్తంగా డీఎస్సీ కోసం 2 లక్షలకు పైగా అభ్యర్థులు నిరీక్షిస్తున్నారు.

## జిల్లా సమాచారం

| | |
|---|---|
| జిల్లాలోని రెవెన్యూ గ్రామాలు | 822 |
| జిల్లాలోని గ్రామ పంచాయతీలు | 697 |
| జిల్లాలోని జనాభా | 18.73 లక్షలు |
| పురుషులు | 9.40 లక్షలు |
| మహిళలు | 9.33 లక్షలు |

గత ఏడాది ఆర్నెళ్లలో వైఎస్సార్‌సీపీ సర్కారు అమలు చేసిన పథకాల లబ్ధి రూ.1858.6 కోట్లు

ప్రస్తుత టీడీపీ కూటమి ఆరు నెలల పాలనలో ప్రజలు నష్టపోయిన లబ్ధి రూ.1750.9 కోట్లు

### పెట్టుబడి సాయం అందలేదు..



ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటుతోంది. ఇప్పటి వరకు పెట్టుబడి సాయం అందలేదు. దీంతో పంటల సాగుకు అప్పులు చేయాల్సిన పరిస్థితి. ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయాం. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికప్పుడు చెప్పిన హామీ మేరకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందజేయాలి. గతంలో ఐదేళ్ల పాటు సకాలంలో రైతుభరోసా సాయం అందింది. పంట నష్టపోతే వెంటనే పరిహారం కూడా అందించారు. – కృష్ణమూర్తి రైతు, నల్లప్పరెడ్డిఊరు, శాంతిపురం మండలం, కుప్పం నియోజకవర్గం

### డీఎస్సీ గురించి ప్రస్తావనే లేదు..



కూటమి ప్రభుత్వం వస్తే మెగా డీఎస్సీ పెడతానన్నారు. దీంతో ఉద్యోగం వస్తుందని ఎంతో ఎదురుచూశా. అయితే ప్రభుత్వం వచ్చి ఆరు నెలలైనా డీఎస్సీ గురించి ప్రస్తావనే ఎత్తలేదు. దీంతో బెంగళూరుకు వెళ్లి ప్రైవేటు ఉద్యోగంలో చేరాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా డీఎస్సీ నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– శ్రీనిషా, వేపగుంట, పుత్తూరు మండలం, నగరి నియోజకవర్గం

## గతంలో అలా.. ఇప్పుడు ఇలా..

గతేడాది ఇదే కాల వ్యవధిలో నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లావ్యాప్తంగా లక్షల మంది పేదలకు రూ.1858.6 కోట్ల లబ్ధిని చేకూర్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది జూన్ 12వ తేదీన కూటమి సర్కారు కొలువుదీరింది. గురువారంతో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలో చేపట్టి ఆరు నెలల పూర్తవుతుంది. సూపర్ సిక్స్ అని ఊదరగొట్టిన చంద్రబాబు అధికారం చేపట్టగానే వాటిని అమలు చేయాలంటే భయమేస్తోందంటూ అసెంబ్లీ సాక్షిగా చేతులెత్తేశారు. కొత్త పింఛన్లు మంజూరు చేసే విషయమై నోరు మెదపడం లేదు. ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామని చెప్పి ఒక్కదానితో సరిపెట్టారు. ఆ ఒక్క సిలిండర్ సబ్సిడీ కూడా అందలేదని జిల్లాలో చాలాచోట్ల ప్రజలు చెబుతున్నారు. సూపర్ సిక్స్‌లో ప్రధానమైన అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రస్తావననే చంద్రబాబునాయుడు ప్రస్తావించడం లేదు. ఫలితంగా కూటమి ఆరు నెలల పాలనపై ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు.

### ఆర్టీసీ బస్సు ఎప్పుడెక్కిస్తారో...



మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం అని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో చెప్పారు. అధికారంలోకి వచ్చి ఆర్నెళ్లు అవుతున్నా అదిగో.. ఇదిగో.. అని మాటలు చెబుతున్నారే తప్ప ఉచిత ఆర్టీసీ ప్రయాణం మాటే ఎత్తడం లేదు. ఎన్నికలు అయిపోయాయి కదా.. ఈ పథకం ఇంకెప్పటికి అమలు చేస్తారో అర్థమే అవ్వడం లేదు. – మునెమ్మ, పాలసముద్రం మండలం, గంగాధరనెల్లూరు నియోజకవర్గం

### ఫీజు కట్టమంటున్నారు..



మా అబ్బాయి ఇంజినీరింగ్ చదువుతున్నాడు. గత ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో మంజూరు చేసేవారు. ఇప్పుడు ఆరు నెలలు అవుతున్నా ఇంకా ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు ఇవ్వనేలేదు. కళాశాల నుంచి ఫీజు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. ఏమి చేయాలో తోచడం లేదు. అప్పు చేయాలంటే భయమేస్తోంది. – వనమ్మ, తవణంపల్లి మండలం, పూతలపట్టు నియోజకవర్గం

### దీపం డబ్బులు పడలేదు



ఇంత వరకు దీపం పథకం సబ్సిడీ డబ్బులు పడనేలేదు. ఎవరిని అడిగినా సమాధానం చెప్పడంలేదు. గ్యాస్ బుక్ చేసిన రెండు, మూడు రోజుల్లోనే ఖాతాలో డబ్బులు పడతాయన్నారు. సచివాలయంలో అడిగితేనేమో పడతాయంటున్నారు. ఆ డబ్బులు కోసం ఇంకెన్ని రోజులు ఎదురు చూడాలో అర్థం కావడం లేదు. – వెంకటేశెట్టి, తవణంపల్లి, పూతలపట్టు నియోజకవర్గం

### కొత్త పింఛన్ కోసం ఎదురు చూస్తున్నా



గతంలో ఆటో తోలుతున్నప్పుడు ప్రమాదం జరిగింది. దీంతో నరాల సమస్య ఏర్పడింది. ఈ వయస్సులో పనిచేయడం కష్టం. ప్రభుత్వం అందించే పింఛన్ వస్తే మందులకు, ఖర్చులకు ఉపయోగపడుతుంది. కొత్త పింఛన్ కోసం సచివాలయంలో దరఖాస్తు చేశాను. త్వరగా మంజూరైతే బాగుండు. – రవి, చిత్తూరు నగరం

# వదిలేస్తే వెళ్లిపోతాం మహాప్రభో!

సీఎం చంద్రబాబునాయుడు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో ప్రభుత్వ అధికారులు పని చేయడానికి భయపడుతున్నారు. మితిమీరిన రాజకీయ జోక్యంతో అధికారులు నలిగిపోతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక టీడీపీ నేతలు తమకు నచ్చిన అధికారులను కుప్పానికి తెచ్చుకున్నారు. కానీ ప్రతి పనిలో వారి జోక్యం పెరగడంతో అధికారులు తట్టుకోలేకపోతున్నారు. కొందరు అధికారులు చట్టాలను పక్కన పెట్టి పచ్చ పార్టీ నేతల ఆదేశాలను పాటించినా.. అవసరం తీరాక అవమానకర రీతిలో వారిపై వేటు తప్పడం లేదు.

- కుప్పంలో పని చేసేందుకు భయపడుతున్న అధికారులు
- ఇటీవల ఫాంహౌస్ సమావేశంలో అధికారులకు కీలక ఆదేశాలు జారీ ఆ ముగ్గురు నేతలు
- ప్రతి పనిలో మితిమీరిన తమ్ముళ్ల పెత్తనం
- మహిళా అధికారులకూ తప్పని కష్టాలు
- పచ్చ నేతల అడుగులకు మడుగులొత్తినా.. చివరికి అవమానాలే..
- చట్ట పరిధిని దాటి పని చేసేందుకు ససేమిరా అంటున్న నిజాయితీపరులు
- బయట పడేందుకు అధికారుల ఆపసోపాలు



కుప్పం/శాంతిపురం: ప్రభుత్వ అధికారులు ఎక్కడైనా చట్టాలకు లోబడి పనిచేస్తారు. కానీ కుప్పంలో మాత్రం పూర్తిగా పచ్చనేతల కనుసన్నల్లో, వారి ఆదేశాల మేరకు మాత్రమే పనిచేయాలని హుకూం జారీ చేస్తున్నారు. దీంతో అధికార పార్టీ పట్ల కాస్త ఎక్కువ అభిమానం ఉన్న కొందరు మినహా.. మిగతా అధికారులు నేతల ఒత్తిళ్లను తట్టుకోలేకపోతున్నారు. నేతల దగ్గర నుంచి గ్రామస్థాయి కార్యకర్తల వరకు కూడా అందరూ అడ్డగోలుగా ఆదేశాలు జారీ చేస్తూ.. పెత్తనం చెలాయిస్తుండడంతో నిజాయితీపరులైన అధికారులు సహించలేక పోతున్నారు. ఈ నేపథ్యంలోనే వారు ఎలాగోలా కుప్పం నియోజకవర్గం నుంచి బయట పడేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే వారి స్థానాల్లోకి రావడానికి వచ్చేవారు ఎవరూ లేకపోవడంతో దినదిన గండంగా ఉద్యోగాలు చేస్తున్నారు.

**ఒత్తిడి తట్టుకోలేక సతమతం..**

సీఎం చంద్రబాబుకు సన్నిహితుడిగా ముద్ర పడిన ఓ విద్యా సంస్థల అధినేత విపక్ష పార్టీ కౌన్సిలర్‌కు చెందిన స్కూల్‌ను లక్ష్యంగా చేసుకుని నోటీసులు ఇవ్వాలని కుప్పం మండల విద్యాశాఖ అధికారిపై ఒత్తిడి చేశారు. దీంతో సదరు అధికారి ఒత్తిడి తట్టుకోలేక తనను బాధ్యతల నుంచి తప్పించాలని వేడుకుంటున్నారు. మున్సిపాలిటీలోని ఓ కీలక అధికారి తాను సీఎం మనిషిగా ప్రచారం చేసుకుంటున్నారు. అయితే ఆయనకు టీడీపీ కౌన్సిలర్లు, ఇటీవల టీడీపీలో చేరిన కౌన్సిలర్లు ఒకే పనిపై కీలక నేతల నుంచి వేర్వేరు సిఫార్సులు చేయిస్తుండడం సదరు అధికారిని ఇరకాటంలో పడేస్తోంది.

**మేము చేయలేం..**

చట్టవిరుద్ధంగా తాను పని చేయలేనని శాంతిపురం మండలంలో ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సులో జనం ముందే ఓ అధికారి తేల్చి చెప్పాడు. అలాగైతే తనను బదిలీ చేసి కావాల్సిన వారిని తెచ్చుకోవాలని సూచించాడు. రామకుప్పంలో అసైన్డ్ భూములకు పట్టాల జారీపై నాయకుల నుంచి ఒత్తిడి తీవ్రం కావడంతో సంబంధిత అధికారి ససేమిరా అన్నారు. ఇలాగే ఉంటే తాను సెలవులో వెళ్లిపోతానని హెచ్చరించినట్టు సమాచారం. గుడుపల్లి మండలంలో జెడ్పీ నిధులతో అభివృద్ధి పనుల కోసం విపక్షానికి చెందిన జెడ్పీటీసీకి ప్రతిపాదనలు ఇచ్చినందుకు ఓ అధికారిపై బదిలీ వేటు వేశారు.

### మా మాటే ఫైనల్..

కుప్పం నియోజకవర్గంలో నాలుగు మండలాలకు, మున్సిపాలిటీకి చెందిన దాదాపు 60 మంది అధికారులతో ముగ్గురు టీడీపీ కీలక నాయకులు ఇటీవల ఫాంహౌస్‌లో నిర్వహించిన సమావేశంలో తాము చెప్పిందే ఫైనల్ అని తేల్చి చెప్పారు. దీంతో ఇక నుంచి తమపై ఒత్తిళ్లు ఉండవని అధికారులు సంబరపడ్డారు. కానీ కింది స్థాయిలో నాయకులు, కార్యకర్తల కర్ర పెత్తనం యథావిధిగా కొనసాగుతుండడంతో అంతా తమ ఖర్మ అని కొందరు అధికారులు సర్దుకుపోతున్నారు.

### మహిళా అధికారులకూ తప్పని వెతలు

పచ్చనేతల దాష్టీకం నుంచి మహిళా అధికారులకు సైతం ఒత్తిడి తప్పడం లేదు. కుప్పం మండలంలో సీఎం సతీమణి నారా భువనేశ్వరి దత్తత తీసుకున్న పంచాయతీలో మహిళా సర్పంచుకు సహకరిస్తున్నారనే కారణంతో ఓ మండల స్థాయి మహిళా అధికారిణి ముప్పుతిప్పలు పెడుతున్నారు. అలాగే గుడుపల్లి మండలంలోని అగస్త్య ఫౌండేషన్‌కు రీజనల్ స్థాయి అధికారుల రాకపై తమకు ముందుగా సమాచారం ఇవ్వలేదని విద్యా శాఖకు చెందిన మహిళా అధికారిపై నాయకులు బహిరంగంగానే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తమకే చివరి నిమిషంలో తెలిసిందని ఆమె చెప్పినా వినిపించుకోకుండా దర్పం ప్రదర్శించారు.

### అన్నీ చేసినా చివరికి వేటే..

కుప్పం డివిజన్‌లో ఓ కీలక పోలీసు అధికారి రాజ్యాంగంలోని చట్టాల కంటే తెలుగుదేశం పార్టీ నాయకుల ఆదేశాల మేరకే పని చేశారనే విమర్శలు మూటగట్టుకున్నాడు. పచ్చనేతల కళ్లలో ఆనందం కోసం అడ్డగోలుగా కేసులు నమోదు చేసి తమ పార్టీ నేతలు, కార్యకర్తలను హింసించారని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు. అయితే సదరు అధికారి టీడీపీ నాయకుల ఆధిపత్య పోరులో పోకచెక్కగా మారారు. చివరకు అతన్ని అవమానకర రీతిలో మూలన పెట్టారనే చర్చ పోలీసు సిబ్బందిలో సాగుతోంది. అవసరానికి వాడుకుని తమ సారును బలి చేశారని బాహాటంగానే చెబుతున్నారు. గొడ్డు చాకిరీ చేస్తున్నా పనికిరాని వాళ్లతో మాటలు పడాల్సి వస్తోందని, హీనంగా చూస్తున్నారని సచివాలయ ఉద్యోగులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో మన స్వాక్షిని చంపుకోలేని అధికారులు కుప్పం నుంచి వెళ్లేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు.

## రైతు ర్యాలీని ఆపేందుకు కుట్రలు

చిత్తూరు కార్పొరేషన్: రైతు సమస్యల పరిష్కారం కోసం 'అన్నదాతలకు అండగా వైఎస్సార్‌సీపీ' కార్యక్రమాన్ని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్నారు. వారం ముందే నిరసన కార్యక్రమం గురించి, మూడు రోజుల ముందు చిత్తూరులో పోలీసులకు రైతు ర్యాలీ వివరాలు తెలిపి అనుమతులు కోరారు. అయితే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని భావించిన కూటమి నాయకులు కార్యక్రమాన్ని ఆపాలని పోలీసులకు చెప్పినట్లు సమాచారం. గురువారం రాత్రి చిత్తూరు పార్టీ కార్యాలయం వద్దకు పోలీసులు వచ్చి రేపటి రైతుల నిరసన కార్యక్రమానికి అనుమతి లేదని చెప్పివెళ్లారు. నాయకులకు ఫోన్ చేసి స్టేషన్‌కు రావాలని బెదిరింపులకు దిగారు. పార్టీ కార్యాలయ సిబ్బంది స్టేషన్‌కు వెళ్లగా, టీడీపీ నాయకులది అదే సమయంలో ర్యాలీ ఉందని, మీ కార్యక్రమాన్ని ఉదయం 9.30 గంటలకు బదులు 11.30 గంటలకు మార్పు చేసుకోవాలని ఆదేశించారు.


మీ ఆప్తుల అంత్యక్రియలు, నిర్యాణం సమాచారం వర్ధంతి, జయంతిల నివాళులు ప్రకటనల కోసం సంప్రదించండి.



మీ ఉన్నతికై శ్రమించిన ఆత్మీయుల జ్ఞాపకాలు, నివాళులు బంధుమిత్రులకు మరియు శ్రేయోభిలాషులకు సమాచారం తెలియజేసే అవకాశం.

సాక్షి దినపత్రికలో అంతిమయాత్ర, శ్రద్ధాంజలి, వర్ధంతి, జ్ఞాపకార్థకూడిక తదితర ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో వున్నారు.

SAKSHI

99122 20586, 97054 44179

Mail id: tptadvtsakshi@gmail.com

## క్లుప్తంగా

### బాబుకు భారత్ సేవా పురస్కారం అవార్డు



అవార్డు అందుకుంటున్న బాబు

**కాణిపాకం:** కాణిపాకానికి చెందిన వ్యక్తిత్వ వికాస శిక్షకుడు బాబు భాతర్ సేవా పురస్కారం వరించింది. గురువారం హైదరాబాద్‌లో జరిగిన పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన సోషల్ జస్టిస్ ఫర్ హ్యూమన్ రైట్స్ జాతీయ చైర్మన్ రాములు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అనేకమంది విద్యార్థులకు ఉచిత సాఫ్ట్‌వేర్ శిక్షణ, బెస్ట్ సోషల్ సర్వీస్ కేటగిరీలో ఆయనకు పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా బాబుకు పలువురు అభినందనలు తెలిపారు.

### సారా తరలిస్తున్న ఇద్దరి అరెస్టు



సీజ్ చేసిన సారా, స్కూటర్‌తో ఎక్సైజ్ పోలీసులు

**చిత్తూరు అర్బన్:** ద్విచక్ర వాహనంలో సారా తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు చిత్తూరు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ పవన్‌కుమార్ తెలిపారు. వివరాలు.. గురువారం పుంగనూరు–మదనపల్లె రోడ్డులో తనిఖీలు నిర్వహిస్తుండగా పుంగనూరు పట్లపల్లెకు చెందిన బాలాజీ నాయక్, సోమశేఖర్ నాయక్ బైక్‌లో 18 లీటర్ల సారా తరలిస్తూ పట్టుబడ్డారు. నిందితులను అరెస్టు చేసి, న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా.. 14 రోజుల రిమాండుకు ఆదేశించారు. దీంతో నిందితులను చిత్తూరులోని జిల్లా జైలుకు తరలించినట్లు సీఐ పవన్ తెలిపారు.

# ఎడతెరపి లేని వాన

- జిల్లాలో 996.5 మి.మీ వర్షపాతం నమోదు
- పలు మండలాల్లో అధికంగా వరి పంటకు నష్టం
- ఉప్పొంగిన వాగులు, వంకలు, కుంటలు
- టమాట రైతులకు మరింత నష్టం
- అత్యధికంగా పాలసముద్రంలో, అత్యల్పంగా గుడుపల్లిలో నమోదు



ఎస్‌ఆర్‌పురం మండలం జీఎంఆర్ పురం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు



పుత్తూరు మండలంలో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

**చిత్తూరు కలెక్టరేట్ :** ఇటీవలే ఫెంగల్ తుపాన్ జిల్లాపై ప్రభావం చూపగా.. మరోసారి నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా బలపడింది. ఈ అల్పపీడనం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు వర్షం కురుస్తూనే ఉంది. అధిక వర్షాల కారణంగా జిల్లాలోని స్కూళ్లు, కళాశాలలు, అంగన్‌వాడీ సెంటర్లకు సైతం ఇన్‌చార్జ్ కలెక్టర్ విద్యాధరి ఉదయమే సెలవును ప్రకటించారు.

**తడసి ముద్దయిన జిల్లా..**

ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు జిల్లా తడిసి ముద్దయింది. జిల్లాలోని నగరి, పాలసముద్రం, నింద్ర, కార్వేటినగరం మండలాల్లో వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. చెరువులు, కుంటలు పారడంతో పలు ప్రాంతాల్లో రాకపోకలకు గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షాలకు పలమనేరు, నగరి, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల్లో అధికంగా వరి పంట దెబ్బతింది. ఇప్పటికే రేట్లు లేక ఇబ్బంది పడుతున్న టమాట రైతులకు ఈ వాన మరింత నష్టం కలిగిస్తోందని పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల్లో పంట సాగు చేసిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముసురు వర్షంతో జనజీవనం స్తంభించింది. చిత్తూరు నగరంలోని తేనెబండ, సంతపేట, గిరింపేట ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల్లోకి ఇళ్ల మధ్య నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ప్రధాన రహదారుల్లో నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి.

**జిల్లావ్యాప్తంగా 996.5 మి.మీ వర్షపాతం నమోదు**

జిల్లావ్యాప్తంగా గురువారం సాయంత్రం 6 గంటల వరకు సేకరించిన వర్షపాతం వివరాల ప్రకారం జిల్లా మొత్తంగా 996.5 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పాలసముద్రంలో 93.0 వర్షం కురిసింది. అత్యల్పంగా గుడుపల్లిలో 11.0 మి.మీ వర్షపాతం నమోదైంది. విజయపురం, యాదమరి, వెదురుకుప్పం, ఐరాల మండలాల్లో వర్షపాతమే నమోదు కాలేదు. సగటున 31.1 మి.మీ వర్షపాతం నమోదైంది. పులిచెర్లలో 62.2, గంగాధరనెల్లూరులో 55.5, కార్వేటినగరంలో 55.3, ఎస్‌ఆర్‌పురంలో 54.0, పెనుమూరులో 49.7, సదుంలో 49.5, నగరిలో 46.5, తవణంపల్లిలో 44.5, గుడిపాలలో 39.8, చిత్తూరులో 39.5, చిత్తూరు రూరల్‌లో 39.5, సోమలలో 34.8, పూతలపట్టులో 33.0, నింద్రలో 32.8, చౌడేపల్లిలో 31.5, బంగారుపాళ్యంలో 28.8, పలమనేరులో 26.5, రొంపిచెర్లలో 24.8, పెద్దపంజాణిలో 24.5, గంగవరంలో 22.0, బైరెడ్డిపల్లిలో 19.0, పుంగనూరులో 18.0, శాంతిపురం, రామకుప్పంలో 16.2, కుప్పంలో 14.7, వి.కోటలో 14.0, గుడుపల్లెలో 11.0 మి.మీ వర్షపాతం నమోదైంది.

### కుంగిన పాదిరేడు పెద్దచెరువు కట్ట

**వడమాలపేట (విజయపురం) :** వడమాలపేటలోని పాదిరేడు పెద్ద చెరువు కట్ట స్వల్పంగా కుంగింది. ఈ విషయం తెలుసుకున్న తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్‌ప్రసాద్, డీఈ శ్రీనివాసులు, తహసీల్దార్ జరీనా గురువారం చెరువు కట్టను పరిశీలించారు. కుంగిన కట్ట వద్ద మరమ్మతు పనులు చేపట్టారు. కలుజును మరింత లోతుగా తవ్వి నీటిని దిగువకు వదిలిపెట్టారు. బుధవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వర్షానికి చెరువు కట్ట స్వల్పంగా కుంగిందని అధికారులు తెలిపారు.



వర్షానికి కుంగిపోయిన పాదిరేడు చెరువు కట్ట

### నీట మునిగిన కారు



వడమాలపేట : వేమాపురం రైల్వే అండర్ బ్రిడ్జి కింద మునిగిన కారు

**వడమాలపేట (విజయపురం ) :** వడమాలపేట మండలం పూడి పంచాయతీ వేమాపురంలో గురువారం సాయంత్రం రైల్వే అండర్ బ్రిడ్జి కింద కారు వర్షపు నీటిలో మునిగిపోయింది. ప్రమాదాన్ని గుర్తించిన డ్రైవర్ వెంటనే కారును నిలపడంతో అందులో ఉన్న ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. వడమాలపేట నుంచి అప్పలాయగుంటకు వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. బుధవారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడుతుండడంతో వేమాపురం రైల్వే అండర్ బ్రిడ్జి కింద భారీగా వర్షపు నీరు చేరింది. దీంతో సుమారు 10 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రైల్వే అధికారులు స్పందించి మోటార్ సాయంతో వర్షపు నీటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

### అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం

జిల్లాలో కురుస్తున్న వర్షాలకు ఎలాంటి నష్టం జరగకుండా జిల్లా యంత్రాంగం పర్యవేక్షిస్తోంది. కలెక్టరేట్‌తో పాటు పలు కార్యాలయాల్లో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తినా కంట్రోల్ రూం నంబర్లకు ఫిర్యాదు చేయాలని అధికారులు ఆదేశించారు. కలెక్టరేట్–9491077356, ల్యాండ్ లైన్–08572–242777, చిత్తూరు ఆర్డీఓ కార్యాలయం–9491077011, కుప్పం ఆర్డీఓ కార్యాలయం–9966072234, పలమనేరు ఆర్డీఓ కార్యాలయం–9491074510, నగరి ఆర్డీఓ కార్యాలయం 9652138325 నంబర్లకు ఫిర్యాదులు చేయాలని అధికారులు వెల్లడించారు.

**నష్టం వాటిల్లకుండా..**

జిల్లాలో కురుస్తున్న వర్షాలకు ప్రజలకు ఎలాంటి నష్టం కలగుండా కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశాం. ప్రజలకు ఎటువంటి సమస్యలు తలెత్తినా వెంటనే కంట్రోల్ రూంకు కాల్ చేసి తెలియజేయాలి. లోతట్టు ప్రాంతాల్లో ఉండే ప్రజలకు సమస్యలు ఉన్నట్లైతే పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించాం. ఎవరైనా శిథిలావస్థకు చేరిన, లేదా మట్టి గోడల ఇళ్లల్లో ఉన్నట్లైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పాం. విద్యుత్ సమస్యలు తలెత్తితే వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని విద్యుత్ అధికారులను ఆదేశించాం.



– విద్యాధరి, ఇన్‌చార్జ్ కలెక్టర్, చిత్తూరు

**KAIRA DISTRICT CO-OPERATIVE MILK PRODUCERS' UNION LIMITED, ANAND.**
Amul Satellite Dairy, Chipilli, Madanapalle, Annamayya Dist, Andhra Pradesh.
**Tender Document No. Ref. No.: KAIRA/AP/PROC/BMCJOB/JAN2025-27/2**
**Tender for Labour Job Contract for BMC locations across Andhra Pradesh Milk Procurement Operations of Amul Dairy**
Amul Dairy- Kaira District Co-operative milk producers' union Ltd., Anand Seeking to register interested parties to participate in the tender for Job contract for day-to-day BMC operations which includes Can Receiving, Sampling, Weighing, Dumping, Cleaning (Milk Cans, Pipelines, BMC tank, Milk Tankers, testing Equipment's, Machinery, Floor, Walls, Windows, Ceilings, water tanks, Cobwebs) as per given frequency and schedule, Milk tankers loading, various materials unloading activities for all our existing BMCs and upcoming BMCs in AP Operations.
Interested parties having requisite infrastructure and relevant experience may download registration form from our website **https://tender.amuldairy.com and submit their complete details with EMD to "Amul Satellite Dairy, Madanapalle, Annamayya, PIN- 517325 from Dt. 13 December 2024 to 20 December 2024 up to 05:00 PM.** Interested parties are invited to visit the Amul Satellite Dairy in Madanapalle, Andhra Pradesh during the above specified period for a site visit for understanding detailed scope. Qualified Registered parties will be invited to participate in commercial process of tender.
**Managing Director reserves the rights for acceptance, partial acceptance and rejection of any tender bids.**
Date:13-12-2024 Sd/- Managing Director

### రూ.8.80 లక్షల రికవరీకి ఆదేశాలు



ప్రజా వేదికలో వివరాలు వెల్లడిస్తున్న తనిఖీ సిబ్బంది

**శాంతిపురం:** మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.8,80,211 దుర్వినియోగం జరిగినట్టు సామాజిక తనిఖీ అధికారులు గుర్తించారు. మొత్తం రూ.8.76 కోట్లతో జరిగిన 1,384 పనులకు సంబంధించి గత 22 నుంచి ఈ నెల 4 వరకు తనిఖీ బృందం పరిశీలించింది. అందులో లోపాలను గుర్తించి బాధ్యులైన నాటి ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ సిబ్బంది నుంచి రికవరీకి గురువారం జరిగిన ప్రజా వేదికలో సిఫార్సు చేసింది. కార్యక్రమంలో అడిషనల్ పీడీ మల్లికార్జున్, ఏపీడీ వెంకటరత్నం, ఎంపీడీఓ కుమార్, ఏపీఓ హరి, తనిఖీ సిబ్బంది పాల్గొన్నారు.

### పంట పొలాలపై ఏనుగుల దాడులు



ఏనుగులు ధ్వంసం చేసిన పంటలను పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

**బైరెడ్డిపల్లె:** మండలంలోని వెంగంవారిపల్లె, కడతట్లపల్లె గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉన్న వ్యవసాయ పంట పొలాలపై బుధవారం రాత్రి ఏనుగుల గుంపు దాడులు చేయడంతో తీవ్రంగా నష్టపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంగంవారిపల్లెకు చెందిన రవిచంద్ర సాగు చేసిన అరటి, మామిడి మొక్కలను ధ్వంసం చేశాయి. కడతట్లపల్లెకు చెందిన శ్రీరాములు సాగు చేసిన బంగాళదుంప పంటను తొక్కి నాశనం చేశాయి. కోత దశలో ఉన్న పంటలను నాశనం చేయడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు. గురువారం ఉదయం అటవీశాఖ సిబ్బంది పంటలను పరిశీలించారు. ప్రభుత్వం తమకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

### పురుగు మందులు ఆఖరి అస్త్రంగా వాడాలి

**పుత్తూరు :** మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులకు సాగులో నూతన శాస్త్ర పరిజ్ఞానాన్ని అందించాలని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ట్రైనింగ్ కోఆర్డినేటర్ భాస్కరయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో పుత్తూరు, సత్యవేడు వ్యవసాయ డివిజన్లలో పనిచేస్తున్న రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా భాస్కరయ్య మాట్లాడుతూ.. తెగుళ్ల నివారణ మందులు, సేంద్రియ ఎరువుల వినియోగానికి డ్రోన్లను వినియోగంతో ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. పంటల సాగులో రసాయన ఎరువులు, మందులు ఆఖరి అస్త్రంగానే వాడాలన్నారు. ఏఓ వేణుగోపాలరావు రబీ వరిలో మేలైన వంగడాలు, ఎరువుల వాడకం, చీడ పీడల నివారణ గురించి వివరించారు. రాస్ కృషి విజ్ఞాన కేంద్రం, ఉద్యానవన శాస్త్రవేత్త సుధాకర్ పూల సాగులో నులి పురుగులు, మల్లె తోటలను నష్ట పరుస్తున్న పూమొగ్గ తొలిచే పురుగు, ఎర్రనల్లి నివారణ గురించి వివరించారు. డీటీసీ భాస్కరయ్య భూసార పరీక్షలు, ఫలితాల గురించి వివరించారు. కార్యక్రమంలో పుత్తూరు, సత్యవేడు ఏడీఏలు రమేష్‌రాజు, సుబ్రహ్మణ్యం, ఏఓలు విజయ్‌కుమార్, హరిత, శోభ, రమేష్, సంజీవరెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.

### తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన పిల్లలు

– అమ్మమ్మను చూద్దామని బెంగళూరుకు సైకిల్‌పై వెళ్లిన పిల్లలు
– సామాజిక మాధ్యమాల్లో వైరల్ – గుర్తించిన కోలార్ వాసులు

**పలమనేరు:** మున్సిపాలిటీ పరిధిలోని గంటావూరుకు చెందిన ఇర్షాద్ కుమారులు హుస్సేన్, రోషన్ మదర్సాలో చదువుకుంటూ బుధవారం సాయంత్రం నుంచి కనిపించకుండా పోయారు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు ఆ పిల్లల ఆచూకీ కోసం తీవ్రంగా గాలించారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో సైతం వైరల్‌గా మారింది. ఇలా ఉండగా ఇద్దరు పిల్లలు గురువారం కోలారు వద్ద సైకిల్‌పై వెళ్తుండగా అక్కడి వారు వీరిని గుర్తించారు. వారిని విచారించగా తాము పలమనేరు నుంచి వస్తున్నామని చెప్పడంతో వారిని అక్కడే ఉంచుకుని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. కుటుంబసభ్యులు వెళ్లి పిల్లలను ఇంటికి తీసుకొచ్చారు. ఎందుకు వెళ్లారని పిల్లలను అడగ్గా.. తాము బెంగళూరులోని అమ్మమ్మను చూసేందుకు వెళ్లామని చెప్పారు. ఎట్టకేలకు పిల్లలు సురక్షితంగా ఇంటికి రావడంతో ఆ తల్లిదండ్రులు ఆనందపడ్డారు.

### గుర్తు తెలియని శవం లభ్యం



గుర్తు తెలియని శవం

**గంగాధర నెల్లూరు:** మండలంలోని మంగినాయని కుప్పం బస్టాప్ దగ్గరలో రోడ్డు కల్వర్టు కింద గుర్తు తెలియని శవం బయటపడింది. జీడీ నెల్లూరు సీఐ శ్రీనివాసంతి కథనం మేరకు వివరాలు.. గంగాధర నెల్లూరు మండలం తూగుండ్రం ప్రధాన రహదారి పక్కన మంగినాయనికుప్పం బస్టాప్ దగ్గరలో ఉన్న రోడ్డు కల్వర్టు కింద గుర్తు తెలియని వ్యక్తి శవం ఉందని పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. సీఐ ఘటనా స్థలికి చేరుకుని శవాన్ని వెలికి తీయించి, మృతి చెందిన వ్యక్తికి 40 నుంచి 45 ఏళ్ల వయసు ఉంటుందని తెలిపారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

# బయట పడుతున్న 'నకిలీ' నిందితులు

- తాజాగా కుప్పంలో మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- లోతుగా విచారణ చేపట్టిన పోలీసులు

**కుప్పం:** సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో నకిలీ పట్టాల బాగోతం రోజుకో మలుపు తిప్పుతోంది. ఇటీవల గుడుపల్లె మండలంలో బయటపడిన నకిలీ పట్టాల వ్యవహారంపై పోలీసు యంత్రాంగం దర్యాప్తు ముమ్మరం చేసింది. గత వారం రోజులుగా పోలీసులు జిరాక్సు సెంటర్లపై ప్రత్యేకంగా నిఘా వేశారు. ఈ క్రమంలో నాలుగు రోజుల కిందట గుడుపల్లె మండలం కోటచెంబగిరి గ్రామానికి చెందిన జగదీష్‌ను అరెస్టు చేసి రిమాండుకు తరలించిన విషయ తెలిసిందే. అదే తరహాలోనే గుడుపల్లె మండలం కంచిబందార్లపల్లెకు చెందిన మురుగేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. గురువారం పట్టణంలోని సబ్ రిజిస్ట్రారు కార్యాలయం సమీపంలో డాక్యుమెంటు రైటర్ కార్యాలయాల వద్ద ఓ జిరాక్సు సెంటర్ యాజమానిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ జిరాక్సు సెంటర్‌లో రెవెన్యూ శాఖకు సంబంధించి రబ్బరు స్టాంపులు, కొన్ని నకిలీ పత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో డాక్యుమెంటు రైటర్ల కాంప్లెక్సులో కూడా నకిలీ పట్టాల తయారీపై పోలీసులు మరో కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. ప్రధానంగా రెవెన్యూ శాఖ పరిధిలోని గ్రామ కంఠాలపై అనుభవ ధ్రువపత్రాలు విచ్చలవిడిగా పంపిణీ జరిగి రిజిస్ట్రేషన్లు కూడా పూర్తి చేసినట్లు సమాచారం. దీనిపై పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ కొనసాగిస్తుండడంతో నకిలీ పట్టాల అంశం ఆసక్తికరంగా మారింది.

**మరింత మందిపై నిఘా..**

సాధారణంగా డీకేటీ భూములు అనుభవిస్తున్న వారిని ప్రభుత్వ అధికారులు గుర్తించి డీ.ఫారం పట్టా అందజేస్తారు. కుప్పం నియోజకవర్గంలో 54 శాతం వ్యవసాయ పొలాలు, గుట్ట పొరంబోకు భూములు అధికంగా ఉన్నట్లు రెవెన్యూ శాఖ గతంలో వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే గుట్ట పొరంబోకును అనుభవిస్తున్న రైతులకు డి.పట్టాల ఇచ్చేందుకు ఓ ముఠా సిద్ధపడింది. ప్రత్యేకంగా నకిలీ పట్టాలను సృష్టిస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంలో పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

### ఇద్దరు అరెస్టు

**గుడుపల్లె:** నకిలీ డీపట్టాలకు సంబంధించిన వ్యవహారంలో మరో ఇద్దరు మురుగేష్, గుణశీలన్‌ను గురువారం అరెస్టు చేశామని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని కంచిబందార్లపల్లెకు చెందిన రాజప్ప పేరిట ఉన్న 1.64 ఎకరాల భూమిని ఆన్‌లైన్‌లో తన భార్య లక్ష్మి పేరిట మార్చాలని వెంకటేష్ అనే వ్యక్తి మురుగేష్‌ను కోరాడు. దీంతో మురుగేష్ కుప్పం పటణంలోని వెన్నెల కంప్యూటర్ సెంటర్ నడుపుతున్న తన స్నేహితుడు గుణశీలన్ వద్దకు వెళ్లి నకిలీ వన్‌బీ నమూనా, అనుభవ ధ్రువీకరణ సృష్టించి ఇచ్చారు. ఇందులోనే 144 శెట్టిపల్లె సీల్ వేసి రైతు వెంకటేష్ దగ్గర నుంచి రూ.5 వేలు తీసుకున్నాడు. అయితే కొన్ని రోజుల తరువాత ఈ భూమి ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో వెంకటేష్ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగాడు. ఈ నేపథ్యంలో బాధితుడు వెంకటేష్ తన భార్య లక్ష్మితో కలిసి గత నెల 26వ తేదీన తమ భూములు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. దీనిపై క్షేత్రస్థాయిలో తహసీల్దార్ సీతారాం విచారణ చేపట్టగా.. వారిది నకిలీ డీపట్టా అని తేల్చారు. ఆయన ఫిర్యాదు మేరకు గత కొన్ని రోజులుగా నకిలీ డీపట్టాల వ్యవహారంపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా మురుగేష్, గుణశీలన్‌ను అరెస్టు చేశారు. ఇంకా ఇలాంటి ముఠాలు ఉన్నారా ? అనే కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.





రైతు వెంకటేష్‌కు ఇచ్చిన నకిలీ వన్‌బీ

### యువకుడిపై పోక్సో కేసు

**చిత్తూరు అర్బన్:** చిత్తూరు నగరంలో ఓ మైనర్ బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పదో తరగతి చదువుతున్న బాలికపై మహేష్ అనే వ్యక్తి ఇటీవల లైంగికదాడికి పాల్పడినట్లు బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు బుధవారం రాత్రి వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఒంటరి ఏనుగు బీభత్సం

**ఐరాల:** మండలంలో ఒంటరి ఏనుగు మళ్లీ విజృంభించింది. గురువారం వేకువజామున వినాయకపురం గ్రామానికి చెందిన రైతు మహేష్ వరి పంటను తొక్కి తిని నాశనం చేసింది. రైతు బాణసంచా సాయంతో ఒంటరి ఏనుగును సమీప అడవిలోకి తరిమేసినట్లు తెలిపాడు. ఆరుగాలం కష్టపడి శ్రమించి వరి పంట సాగు చేస్తే చేతికి వచ్చే సమయంలో ఏనుగు నాశనం చేసిందని ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారు రూ.20 వేలు వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగుల బారి నుంచి పంటలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

# అటవీశాఖ.. అక్రమాల ఇలాకా

- ఇప్పటికే ఎన్‌హెచ్ ఇచ్చిన రూ.27 లక్షల పరిహారం స్వాహా ?
- చెట్ల కటింగ్, రవాణాకు డిపార్ట్‌మెంట్ ఇచ్చిన రూ.17 లక్షలు హాంఫట్
- సోషల్ ఫారెస్ట్‌లో చెట్లకు పాదులు చేయకుండానే రూ.4 లక్షలు మాయం
- పలమనేరు అటవీశాఖలో తవ్వే కొద్దీ వెలుగు చూస్తున్న అక్రమాలు
- ఇక్కడి నుంచి బదిలీపై వైఎస్సార్ కడప జిల్లాకు వెళ్లిన ఓ అధికారి అక్రమాలు
- నిధుల దుర్వినియోగంపై కొనసాగుతున్న విచారణ



కౌండిన్య ఫారెస్ట్‌లో ఎక్స్‌ప్రెస్ హైవే పనుల కోసం చెట్లను తొలగించిన ప్రాంతం

**పలమనేరు:** పలమనేరు అటవీశాఖలో గతంలో ఇక్కడ పనిచేసి కడప జిల్లాకు బదిలీ అయిన ఓ అధికారి అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఇప్పటికే ఇక్కడి ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం కోసం అడవిలోని వృక్షాలకు సంబంధించి రూ.27 లక్షల దాకా అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు వచ్చాయి. దీనిపై డీఎఫ్ఓ భరణి విచారణ చేపట్టారు. ఇదేకాకుండా డిపార్ట్‌మెంటల్ ఎక్స్‌టెన్షన్ పనులు, సామాజిక వనాల పెంపకంలో చెట్లకు పాదులు చేయకుండానే.. చేసినట్టు బిల్లులు పెట్టి ఆ డబ్బులు కూడా స్వాహా చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అవినీతి బాగోతాలపై కొనసాగుతున్న విచారణలో మరిన్ని అక్రమాలు వెలుగుచూసే అవకాశం కనిపిస్తోంది.

**కొట్టిన చెట్లు ఏమయ్యాయో..!**

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఆ శాఖ అధికారులు చెల్లించిన నష్టపరిహారంతో పాటు హైవేలోని వృక్షాలను నరికించడం, వాటి రవాణా కోసం డిపార్ట్‌మెంటల్ ఎక్స్‌ట్రాక్షన్ పేరిట అటవీశాఖ అంచనాలను తయారు చేసి ఇందు కోసం రూ.17 లక్షలను మంజూరుచేసింది. ఈ డబ్బు ఏమైందో తెలియని పరిస్థితి. ఇంతేకాక అసలు డిపార్ట్‌మెంట్ కొట్టించిన చెట్లు ఎన్ని ? అవి ఎక్కడున్నాయి ? అనే లెక్క కూడా లేకుండా పోయింది. దీంతోపాటే ఎక్స్‌ప్రెస్ హైవే పేరిట తొలగించిన చెట్ల ముసుగులో అడవిలోని విలువైన వృక్షాలను సైతం కొట్టి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**మరో రూ.4 లక్షలు కాజేసి..**

పలమనేరు ఫారెస్ట్ రేంజి పరిధిలో పలు సోషల్ ఫారెస్ట్ వనాలు ఉన్నాయి. వీటిని బలహీనమైన అటవీప్రాంతంలో వనాల అభివృద్ధి ద్వారా పెంచుతున్నారు. ఆ మేరకు గంగవరం మండలంలోని బూడిదపల్లి, గాంధీనగర్ బీట్లలో ఎర్రచందనం, టేకు, తంగేడు లాంటి మొక్కలను పెంచారు. వీటికి ఏటా పాదులు చేసే కార్యక్రమాన్ని అటవీశాఖ చేపడుతోంది. ఈ క్రమంలో తాను బదిలీ అయినట్లు తెలుసుకున్న ఆ అధికారి అక్కడి రెండు బీట్లలో చెట్లకు పాదులు చేయకనే చేసినట్లు సిబ్బందిపై ఒత్తిడి తెచ్చి రూ.4 లక్షల దాకా బిల్లులు చేసి స్వాహా చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఇక్కడ జరిగిన అక్రమాలపై డిపార్ట్‌మెంట్ విచారణ చేస్తున్నామని అక్రమాలకు పాల్పడినవారిపై చర్యలు తీసుకుంటామని డీఎఫ్ఓ భరణి తెలిపారు.



గాంధీనగర్ బీట్‌లో చెట్ల మొదళ్లకు పాదులు చేయని సోషల్ ఫారెస్ట్ వనం

## సాక్షి క్లాసిఫైడ్స్

Education

Wanted

**DIRECT FINAL YEAR**
Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT,B.Tech,Diploma,MA,M.Com,M.Sc, MBA,MCA Regular/lateral entry.9381287629

Real Estate

**PLOTS FOR SALE**
8 లక్షలకే తిరుపతి IISER ఆనుకొని ఫైనల్ అప్రూవ్డ్ ప్లాట్లు. అన్ని వసతులతో తక్కువ ధరకే డైరెక్ట్ ఓనర్, స్పాట్ రిజిస్ట్రేషన్. 9502774175,7416211984.

తిరుపతి, రామచంద్రాపురం దగ్గర తక్షణ గృహ నిర్మాణానికి అనువైన తుడ అప్రూవల్ ప్లాట్స్ 41 అం.లు కేవలం రూ. 15,45,000 మాత్రమే. ✆ 99660 66111.

**BUSINESS SERVICE**

**BUSINESS OFFER**
ఇంటి దగ్గరే ఉంటూ మీ మొబైల్‌లో అన్ని రకాల రీచార్జిలు చేసుకుంటూ నెల నెలా అధిక ఆదాయం సంపాదించే అవకాశం. మొబైల్ ఉన్న ప్రతి ఒక్కరూ సంప్రదించండి: 8639396677.

**PERSONAL CARE**

**CHANGE OF NAME**
I, C.Vema Nithin Reddy S/o C.Vemaiah, Qualification: B.Tech, Shall henceforth be known as Chiripireddy Vema Nithin Reddy S/o Chiripireddy Vema Reddy due to Parental Mistake. C.Vema NithinReddy.

తిరుపతిలో ప్రముఖ హాస్పిటల్ నందు పనిచేయుటకు B.ఫార్మసీ (Female) కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత. ✆ 9490046456, 9246999901.

తిరువానూరు మెయిన్ రోడ్డు లాడ్జి నందు పనిచేయుటకు ఇంగ్లీష్ మాట్లాడ కలిగిన రిసెప్షనిస్ట్, రూమ్ బాయ్స్ కావలెను. సంప్ర: 9110550998.

స్పాట్ జాయినింగ్ (Only for females). మా ఆఫీసు నందు టెలికాలర్స్, కంప్యూటర్ ఆపరేటర్, కౌన్సిలర్స్, PRO'S కావలెను. Q:SSC-Degree. Age:20-40. జీ:20K to 25K.✆ 9885122224.

**SEEKING MALE** candidates to collect data from MSME units for ZED certification in Chittoor and Tirupati (Dist). Degree Pass Compulsory, Two-wheeler required. Good salary Incentives. Contact : +91-7013163132

Universal యాడ్స్ కంపెనీకి మొబైల్‌లో SMSలు పంపుతూ వారానికి 5000 నుండి 8000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418.

మీ ఇంటి వద్దనే ఉంటూ మీ మొబైల్ ద్వారా ప్రతి రోజు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3,500 సంపాదించుకోండి. వివరాలకు వాట్సాప్‌లో Hi అని మెసేజ్‌చేసి కాల్ చేయండి. 82478 08801.

కస్టమర్లు కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం. HYD. 8919613984

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

## గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.